క్లుప్తంగా

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



ప్రిన్సిపాల్‌కు మొక్క అందిస్తున్న విద్యార్థిని

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రకృతి సంపద అయిన అడవులను సంరక్షించడానికి విద్యార్థులు, యువత బాధ్యత తీసుకోవాలని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరాబాబు సూచించారు. స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షితః అనే నినాదాన్ని వివరించారు. జంతు శాస్త్ర అధ్యాపకులు విజయకుమార్ మాట్లాడుతూ అడవుల ప్రాముఖ్యతను వివరించారు. వృక్ష శాస్త్ర అధ్యాపకులు టీవీఎస్ పద్మావతి మాట్లాడుతూ అడవుల ప్రాముఖ్యత, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, గ్లోబల్ వార్మింగ్ గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించం



లౌడ్ స్పీకర్లను తొలగిస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రహదారి భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని ఉపరవాణా కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు. ఇటీవల ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఏలూరు నగరంలో శుక్రవారం ఆటోలు, ఇతర వాహనాలను తనిఖీ చేసినట్టు చెప్పారు. వాహన తనిఖీ అధికారి రమేష్ బాబు, జగదీష్ 45కి పైగా ఆటోల్లోని లౌడ్ స్పీకర్ల కనెక్షన్లను తొలగించారని, వాహనాలకు అదనంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లను తీయించివేశారని వివరించారు.

ఇంగ్లిష్ పరీక్షకు 4,137 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 4137 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 22 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 4,161 మంది రెగ్యులర్ విద్యార్థులకు 4132 మంది హాజరు కాగా 29 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు ఏడుగురికి ఐదుగురు పరీక్ష రాశారు. ఈ పరీక్షను ఎంఈఓ డి.వెంకట రమణ పర్యవేక్షించారు.

మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం

ఏలూరు (టూటౌన్) : మహిళలకు స్వయం ఉపాధి పథకాలను ప్రవేశ పెట్టాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల దళిత సేన ఆధ్వర్యంలో లావేటి ప్రవల్లిక టీచరు మూడు నెలలు కాలం కుట్టు శిక్షణ ఇచ్చారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని దళిత సేన రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సర్టిఫికెట్లను రవి ప్రకాష్ అందజేశారు. మహిళలకు కుట్టు శిక్షణతోపాటు ఉచితంగా కుట్టు మెషీన్లు, సబ్సిడీ రుణాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సేన ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, దళిత సేన ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శిఖకొల్లు స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

ఫోమ్ బోర్డుల అందజేత

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు తల్లి నుంచి బిడ్డకు హెచ్‌ఐవీ, సిఫిలిస్ వ్యాధులు సంక్రమించకుండా అవగాహన కల్పించే ఫోమ్ బోర్డులను శుక్రవారం స్థానిక పవర్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ అధికారి ఎం నాగేశ్వర రావు చేతుల మీదుగా అందజేశారు. డాక్టరు గౌతం, పి.బాలాజీ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎ.హరినాథ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరులకు జోహార్లు

వేలేరుపాడు: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన విప్లవ వీరులకు యువతరం ఎప్పటికీ రుణపడి ఉంటుందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్), అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నాయకులు అన్నారు. వేలేరుపాడులో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి బందం నాగేశ్వర రావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యర్రా మధు మాట్లాడుతూ 23 సంవత్సరాల వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ఉరి కంభం ఎక్కిన విప్లవ వీరుల 94వ వర్ధంతి ఈ నెల 23వ తేదీన ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కంగాల గంగరాజు, నాయకులు మచ్చా చంద్రరావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అందని భరోసా

- ఏటా రూ.15వేలు అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి
- తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయించని వైనం
- లబోదిబోమంటున్న డ్రైవర్లు



ఆటో డ్రైవర్లకు భరోసా అందజేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి(ఫైల్)

దెందులూరు: ఎన్నికలకు ముందు ఒక మాట..తర్వాత మరో మాట చెప్పడం, అన్ని వర్గాలకు ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం, అధికారం వచ్చిన తర్వాత వాటిని అటకెక్కించడం సీఎం చంద్రబాబునాయుడికి పరిపాటిగా మారింది. ప్రజలను పదేపదే మోసం చేయడంలో తనకు తానే సాటి అని ప్రతీసారి నిరూపించుకుంటున్నారు. 2014లో అరువందలకు పైచిలుకు హామీలు ఇచ్చి, మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. 2024లోనూ అదే రీతిలో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక తనదైన తీరులో ఎగనామం పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారు. కూటమి అధికాంరలోకి వస్తే సైపర్‌సిక్స్ పథకాలతో పాటు ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లు, హెవీ లైసెన్స్ కలిగిన లారీ, ట్రిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15వేల ఆర్థిక సాహాయం అందిస్తామని చెప్పారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, డ్రైవర్ల పిల్లలకు విద్యారుణాలు తదితర హామీలను మేనిఫెస్టోలో పేర్కొన్నారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చి పదినెలలు గడిచిపోతున్నా వీటిలో ఏ ఒక్క హామీ కార్యరూరం దాల్చలేదు. తాజాగా ప్రవేశపెట్టిన 2025–26 వార్షిక బడ్జెట్‌లో ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం పథకానికి నిధులు కేటాయించలేదు. సంక్షేమ బోర్డు, ఇతర హామీలను పరిగణలోకి తీసుకోలేదు. దీంతో ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి రూ.15వేలు ఆర్థిక సాయం ఇవ్వాల్సిందేనని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం సాయం అందించకపోగా అధికారంలోకి వచ్చిన రోజు నుంచే రకరకాల పేర్లతో అపరాధ రుసుములు విధిస్తూ తమపై బాదుడు మొదలు పెట్టారని మండిపడుతున్నారు.

గతంలో రూ.50వేల అందింది

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10వేల చొప్పున సాయం అందించారు. ఐదేళ్లలో రూ.50వేలు అందుకున్నారు. ఈ డబ్బుల ఇన్సూరెన్స్ ఫిటినెస్ సరిఫికెట్, మరమ్మతులకు ఉపయోగపడేవి. ప్రస్తుత ప్రభుత్వంలో మాకు ఎలాంటి సాయం ఇంతవరకు అందలేదు.

మాట నిలబెట్టుకున్న జగన్‌మోహన్‌రెడ్డి

2019కు ముందు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో ఆయనను ఆటో డ్రైవర్లు కలిసి సమస్యలు చెప్పుకున్నారు. దీంతో తాము అధికారంలోకి వస్తే సొంతంగా ఆటో ఉన్నవారితో పాటు ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేలు ఇస్తామని ఆయన మాట ఇచ్చారు. ఇచ్చినమాట ప్రకారం 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వాహనమిత్ర పథకం పేరిట రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఐదేళ్ల పాటు ఏటా ఈ ఆర్థిక సాయం అందిస్తూ వచ్చారు. ఈ డబ్బులను ఆటో మరమ్మతులు, ఇన్సూరెన్స్, ఫిటినెస్ సర్టిఫికెట్ వంటి వాటి కోసం ఉపయోగించుకునేవారు.

చెప్పిన తేదీకి ఇచ్చేవారు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వాహన మిత్ర పథకం ద్వారా చెప్పిన తేదీకి రూ.10వేలు ఇచ్చేవారు. కేవలం ఆటో నడుపుకుంటూ వచ్చే ఆదాయం ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్న మాకు ఆ డబ్బులు ఎంతగానో ఉపయోగపడేవి. కూటమి అధికారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తామన్నారు. కానీ మాకు ఇంకా ప్రభుత్వం నుంచి సాయం అందలేదు.

– నత్త సాగర్, ఆటో డ్రైవర్, సానిగూడెం

డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి



తమతో పాటు తమపై ఆధారపడిన కుటుంబ సభ్యులను ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలి. పథకాన్ని ఆపకుండా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందించాలి. ఆటో డ్రైవర్ల అందరి కుటుంబాలు ఇబ్బందులు లేకుండా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– కొండపల్లి చంద్రమోహన్, డ్రైవర్, నాగులదేవునిపాడు

ఆదాయం తగ్గింది.. ఆటోలు పెరిగాయి



ఆటోలు మరిన్ని పెరిగిపోయాయి. దీంతో ప్రతి ఆటో డ్రైవర్‌కు ఆదాయం తగ్గింది. ఆదాయం లేక ప్రభుత్వసాయం అందక ఇబ్బందులుపడుతున్నాము. ఆటో డ్రైవర్ల సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలి.

– బాబురావు, ఆటో డ్రైవర్, నాగులదేవునిపాడు

బీసీ కాలనీలో చర్చిని తొలగించాలి



తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీసీ కాలనీ వాసులు

ఉంగుటూరు: మండలంలోని బీసీ కాలనీలో ఉన్న చర్చిని తొలగించాలని ఆ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ పూర్ణచంద్రప్రసాద్‌కు, పంచాయతీ ఈవో బొడ్డు రవికుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. 1989లో గ్రామంలోని పేదలకు స్థానిక భీమేశ్వరస్వామికి చెందిన 4 ఎకరాలు 19 సెంట్లు దేవుడ భూమిని కేటాయించి ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. అందులోకి వేరే గ్రామానికి చెందిన వ్యక్తికి ఈస్థలం ఎలా వచ్చిందో విచారణ చేయాలని కోరారు. నివేసిత పొంతంలో చర్చి ఏర్పాటు చేసి సమయం సందర్భంగా లేకుండా లౌడు స్పీకర్లు తో మనశ్శాంతికి బంగం కలిగేలా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

షిర్డీ సాయికి ప్రత్యేక పూజలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఆదివారపు పేట షిర్డీ సాయి ప్రేమ మందిర్ ఆరో వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం తెల్లవారు జామున సాయి భక్తులచే నగర సంకీర్తనలు, ఉదయం 9 గంటలకు బాబా వారికి వివిధ పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, సాయంత్రం వాసా ప్రసాద రావు సత్సంగం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు శేజ్ హారతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బాబా సేవకులు పాల్గొని సేవలను అందించారు.

హామీలు అమలు చేసేదెప్పుడు?



ముంగర సంజీవ్ కుమార్

దెందులూరు: ఎన్నికల హామీ లను కూటమి నాయకులు ఎప్పుడు అమలు చేస్తారని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ అన్నారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు జారీ చేసిన 120 జీవో కారణంగానే కొల్లేరు ప్రజలు తీవ్రంగా నష్టపోతాయరని, సుప్రీంకోర్టు ఆదేశాల అనుసరించి దివంగతనేత వైఎస్సార్ కొల్లేరు ప్రక్షాళన చేయాల్సి వచ్చిందన్నారు. కొల్లేరుపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న లంక గ్రామాల ప్రజలు నష్టపోకుండా వైఎస్సార్ 350 సొసైటీలకు కోట్ల రూపాయలు నష్టపరిహారం చెల్లించి ఆదుకున్నారన్నారు. వైఎస్సార్ సేవలు కొల్లేరు ప్రజలు మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయయాయన్నారు. పాదయాత్రలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొల్లేరులో ఉన్న వడ్డీలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి కార్పొరేషన్ చైర్మన్ ఇస్తామన్నారు. కొల్లేరుకు ఒక ఎమ్మెల్సీ ఇస్తామని వాగ్దానం చేశారని ఆయన చేసిన వాగ్దానం మేరకు ప్రభుత్వం ఏర్పాటు అనంతరం కొల్లేరుకు వడ్డీలు కార్పొరేషన్ చైర్మన్, ఒక ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవి ఇచ్చారని తెలిపారు. కాని నేడు ఆ ఎమ్మెల్సీ ఆయన స్వార్థం కోసం వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీ మారటం కొల్లేరు ప్రజలను మోసం చేయడమేనన్నారు. అన్ని సభల్లోనూ సూపర్ సిక్స్ హామీలంటూ ప్రజలను నమ్మించారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారం చేపట్టి పదినెలలు అవుతున్న హామీల అమలుకు దిక్కులేకుండా పోయిందన్నారు.

క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి



గణపవరంలో క్షయవ్యాధిపై అవగాహన ప్రదర్శన చేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: క్షయ రహిత సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని, క్షయవ్యాధిని తొలిదశలోనే గుర్తిస్తే నివారణ పూర్తిగా సాధ్యమని గణపవరం, పిప్పర వైద్యాధికారులు పి.కిరణ్మయి, కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం గణపవరం, పిప్పర పీహెచ్‌సిల పరిధిలో క్షయవ్యాధిపై వైద్యసిబ్బందికి అవగాహన సదస్సులు, క్షయనివారణ ప్రదర్శనలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ క్షయవ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, క్షయవ్యాధి లక్షణాలను ప్రతీ ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించాలన్నారు. పీహెచ్‌సీలో ఉచితంగా టిబి పరీక్షలకు సైటిబి పరీక్ష చేసి వ్యాధినిర్ధారణ అయితే ఆరు నెలలపాటు మందులు వాడితే క్షయవ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. గ్రామంలో క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు.

22న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెదపాడు: ఈనెల 22న మధ్యాహ్నం 2.30గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎండీ అమీలు జమా తెలిపారు. ఎంపీపీ బత్తులరత్నకుమారి అధ్యక్షతన నిర్వహించే ఈసమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హజరుకావాలన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ చింపివేత



దెందులూరు బస్టాండ్ సెంటరులో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ చించిన దృశ్యం

దెందులూరు: దెందులూరు బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీని చింపివేయడం అనాగరికమని దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టా ఏసుబాబు, బాలకృష్ణ అన్నారు.ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, మాజీ దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పార్టీ పెద్దల చిత్రాలతో బస్టాండ్ సెంటర్ వద్ద ఫ్లెక్సీ నాయకులు ఏసుబాబు, బాలకృష్ణ ఏర్పాటు చేశారు. వైఎస్ జగన్, కోటగిరి శ్రీధర్, కొఠారు అబ్బయ్య చౌదరి ఫోటోలు చూస్తుంటే భయపడిన వారు వెన్నులో వణుకు వస్తున్న వారు ఫ్లెక్సీ ని చింపివేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకాలు, విగ్రహాలు, ఫ్లెక్సీలు వీటిని తాము తొలగించలేదన్నారు. ఫ్లెక్సీలను చింపివేసి ఆనంద పడుతున్నారని పోలీసులు నిందితులను పట్టుకుని శిక్షించాలని కట్టా ఏసుబాబు, బాలకృష్ణ పోలీసులను కోరారు.

13న గురుకుల ప్రవేశ పరీక్షలు

పెదపాడు: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 5, ఇంటర్ ప్రవేశాలకు ఏప్రిల్ 6న నిర్వహించాల్సిన ప్రవేశపరీక్ష ఏప్రిల్13న నిర్వహిస్తున్నట్లు వట్లూరు బీఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి తెలిపారు. ఏప్రిల్13న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఉపాధి కూలీలకు పాత బకాయిలు చెల్లించాలి



జల్లికాకినాడలో ఉపాధికూలీల సమస్యలు తెలుసుకుంటున్న లక్ష్మణరావు

గణపవరం: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పాతబకాయిలను తక్షణం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కె.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం గణపవరం మండలం జల్లికాకినాడ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలను కలసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు పరిశీలించారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ జిల్లాలోని అనేక మండలాలలో నెలలు, వారాలు తరబడి పనిచేస్తున్న కూలీలకు వేతనాలు వారి బ్యాంకు ఖాతాలలోజమకాకపోవడం దారుణమని, కేంద్ర ప్రభుత్వం ఈవిషయంలో తక్షణ చర్యలు తీసుకుని ఉపాధి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం ప్రతీ ఏటా నీరుగారుస్తుందని, బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తగ్గడమే దీనికి నిదర్శనమన్నారు. ఉపాధి పని చేసే ప్రదేశాలలో కూలీలకు నీడ కల్పించాలని, సమ్మర్ అలవెన్సులు చెల్లించాలని, మంచినీరు ఏర్పాటు చేయాలని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతీ కార్మికుడికి ఏటా కనీసం 200 పనిదినాలు కల్పించాలని, కనీస వేతనం రూ.600 చెల్లించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మికసంఘ నాయకులు పాల్గొన్నారు.

దళితులను విభజించడం సరికాదు



ముళ్లగిరి జాన్సన్

భీమడోలు: ఎస్సీ వర్గీకరణ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా దళితులను విభజించడం దారుణమని, ఈ ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని రాష్ట్ర దళిత మాల నాయకులు, భీమడోలు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ అన్నారు. భీమడోలులో శుక్రవారం రాత్రి ఆయన ఓ పత్రికా ప్రకటనను విడుదల చేసారు. ప్రస్తుత జనాభా లెక్కల ఆధారంగా వర్గీకరణ చేయాల్సిఉండగా 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. దీనిని తామంతా వ్యతిరేకిస్తున్నామన్నారు. దళితులకు రాజ్యాంగ కల్పించిన ఫలాలను సమానంగా పంచాలని, విభజించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. పార్లమెంట్‌లో చట్టం చేయకుండా సుప్రీంకోర్టు తీర్పును లెక్కచేయకుండా దళితులను విభజిస్తే సీఎం చంద్రబాబు, తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డికి తిప్పలు తప్పవన్నారు. రాష్ట్రంలో మాలలు 70 లక్షలమంది ఉండగా 40లక్షల మంది అంటూ తప్పుల లెక్కల చూపించారన్నారు. కూటమి సర్కారు దళితులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. మాలలంతా అప్రమత్తంగా ఉండాలని, రాబోయే రోజుల్లో కనువిప్పు కలిగేలా ఐక్యతను చాటాలన్నారు. కమీషన్ ఇచ్చిన నివేదికకు మాలలు వ్యతిరేకమని, 2026లో జనాభా లెక్కల ఆధారంగా మాలజాతిని లెక్కించాలన్నారు.

పోలీసు స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ కె ప్రతాప శివకిశోర్

పెదపాడు: పోలీసులు తమకున్న విజ్ఞానాన్ని పనిని మెరుగుపర్చడంలో వినియోగిస్తే తాము చేసే పనిని విజయవంతంగా పూర్తి చేయవచ్చునని జిల్లా ఎస్పీ కే ప్రతాప శివకిషోర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పెదపాడు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. తొలుత మహిళా పోలీసులతో మాట్లాడారు. వారికి రావాల్సిన ఇంక్రిమెంట్స్ అందుతున్నాయా డీపీఓ నుంచి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు ఎదురైనా వెంటనే ఎస్‌హెచ్‌ఓ సమాచారం అందజేయాలన్నారు. అనంతరం సిబ్బంది పేరుపేరున వారిని పలకరించి ఈ స్టేషన్‌కు వచ్చి ఏన్నాళ్లు అయిందనే విషయాన్ని తెలుసుకున్నారు. తొలుత గ్రామ సచివాలయ భవనాన్ని పరిశీలించారు. పోలీసు స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రక్కనే ఉన్న సచివాలయ భవనంలోకి మార్చేందుకు సన్నాహాలు చేస్తుండటంతో భవనమంతా కలియతిరిగి పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డీఎస్పీ ఎస్‌వీవీ ప్రసాద్, సీఐ శ్రీనివాసరావు, పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ పోలీసులు మహిళాపోలీసులు పాల్గొన్నారు.

భీమడోలు జంక్షన్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు ఏవీ?

బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు, భక్తులు



భీమడోలు జంక్షన్ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం ఎదురు చూస్తున్న జనం



భీమడోలు బస్టాండ్ వద్ద ప్రయాణికుల అవస్థలు

భీమడోలు: జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న భీమడోలు జంక్షన్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు రాక దూర ప్రాంతాలకు వెళ్లే భక్తులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వచ్చే అరకొర ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుండుగొలను నుంచి కొవ్వూరు వరకు నేషనల్ హైవే విస్తరించడంతో ఎక్స్‌ప్రెస్‌లన్నీ హైవేపై వెళ్తున్నాయి. గతంలో తప్పనిసరిగా భీమడోలు జంక్షన్‌కు వచ్చి వెళ్లే ఆ బస్సులన్నీ కొత్త హైవేపై నుంచి వెళ్లిపోతుండడంతో సమస్యకు కారణంగా మారిందని భక్తులు, ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు.భీమడోలు జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపాలని కోరుతూ ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు అనేక సార్లు వినతులు అందజేసినా ఆర్టీసీ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో ఆర్టీసీ అధికారుల పనితీరును బాహటంగా విమర్శిస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలలోని శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు. ప్రయాణికులు భీమడోలు జంక్షన్ పడుతున్నా పాట్లు వర్ణనాతీతం. ఇదీ ఉండగా భీమడోలు జంక్షన్ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే వారంతా నానా ఆగచాట్లు పడుతున్నారు. ఇక్కడ బస్టాండ్ ఉన్నా.. ప్రాంగణంలోకి కేవలం పల్లె వెలుగు బస్సులు తప్ప ఎక్స్‌ప్రెస్ బస్సులు వెళ్లవు. వచ్చే అరకొర ఎక్స్‌ప్రెస్‌లు సైతం ప్రాంగణంలోకి రాకుండా రోడ్డుపై ఆగి వెళ్లిపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రాంగణంలోకి వచ్చే ప్యాసింజర్లు కోసం ఎదురు చూస్తుండడగా... అదే సమయంలో బస్టాండ్‌కు బయట రోడ్డుపై ఎక్స్‌ప్రెస్, ప్రైవేటు వాహనాలు వస్తే కుటుంబ సమేతంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు ఉరుకులు పరుగులు తీయాల్సి వస్తుంది. శనివారం, ఆదివారాలతో పాటు పలు శుభ దినాల్లో రెట్టింపు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని వాపోతున్నారు. నిత్యం ఈ ప్రాంగణం నుంచి 2500 మంది ఉమ్మడి జిల్లాలకు చెందిన భక్తులు, ప్రయాణికులు ద్వారకాతిరుమలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం బయట రోడ్డుపై ఎండనక, వాననక గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తుంది. ప్యాసింజర్ బస్సుల కోసం ప్రాంగణంలోకి... ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం బయటకు నానా హైరానా పడుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ ఉన్నప్పటికీ బస్సులు ఎక్కేందుకు పడే బాధలు వర్ణనాతీతమని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా భీమడోలు జంక్షన్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలిపేలా కూటమి నాయకులు తగు శ్రద్ధ వహించాలని ప్రజలు వేడుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు ఎక్స్‌ప్రెస్ బస్సు లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నూకాలమ్మ కలశాల ఊరేగింపు



కలశాల ఊరేగింపులో పాల్గొన్న సువాసినీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేట నూకాలమ్మ వారి 45వ జాతర మహోత్సవాలు దేవాదాయ శాఖ, ఉత్సవ కమిటీ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 28 వరకు నిర్వహించనున్న మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ అర్చకులు మంత్రవాది రామకృష్ణ యోగానంద శాస్త్రి అమ్మవారికి స్నాన కార్యక్రమంతో పాటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు, డప్పువాయిద్యాల నడుమ 216 మంది మహిళలు, సువాసినీలు కలశాలతో పాదయాత్రగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మ వారికి స్నాన కార్యక్రమంలో అభిషేకాలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దావాలా రంగ సత్యనారాయణ మాట్లాడుతూ తొమ్మిది రోజులు జరిగే ఈ మహోత్సవాల్లో భక్తులంతా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆలయ ఈఓ మీసాల వెంకట్రావు, జంపా సూర్యనారాయణ, కొఠారి అప్పలకొండల రావు, గొంతిన రామకృష్ణ, త్రిపర్ణ రాజేష్, ఉల్లింగుల సురేష్, వెల్లంకి రాజు, నక్క నాగేశ్వరరావు, కోలా సురేష్, కరణం రాజు (ఇసుక రాజు), గొంతిన సర్వేశ్వరరావు, సంబంగి కిరణ్ కుమార్, ఆరేరాపు విక్రమ్, సిరిపురపు కోట, బి.దుర్గారావు, భక్తులు పాల్గొన్నారు.